క్లుప్తంగా

సచివాలయం పరిశీలన



గాడాల సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్పీఓ వీణాదేవి

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల సచివాలయాన్ని గురువారం జిల్లా పంచాయతీ అధికారి వీణాదేవి తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. గ్రామంలోని రైస్‌మిల్లును తనిఖీ చేశారు. సచివాలయం సెక్రటరీ బి.సత్యానంద కుమార్, గుమస్తా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

పెదపూడి: మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పి క్రైస్తవులకు రక్షణ కల్పించాలని ఆంధ్ర మాలమహానాడు అధ్యక్షుడు సిద్దాంతుల కొండబాబు డిమాండ్ చేశారు. పెదపూడిలో గురువారం మండల పాస్టర్ల ఫెలోషిప్, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా పాస్టర్ల ఫెలోషిప్ సంఘం ప్రతినిధి డాక్టర్ జి.అమృతరావు, దేవి స్‌రాజు, బుంగా సతీష్ కుమార్, బద్దా రాజేష్, ఎస్.రాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న వృక్ష శాస్త్ర అధ్యాపకుడి పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంఎస్సీ జువాలజీ 50 శాతం మార్కులతో పాసైనవారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 18వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో పోలింగ్ బూత్‌ను ఎంపీడీవో జేఏ ఝాన్సీ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంగరాజు, వీఆర్వో మాచవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజానగరం: దివాన్‌చెరువులోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి వైద్యులు సుమారు 700 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు, పవన్ ఆపిల్ డెంటల్ కేర్ వైద్య సిబ్బంది దంత పరీక్షలు చేశారు. ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ పట్నాల విశ్వనాథ్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు జీవీఎల్ వసంత కుమారి, ఏవీఎస్ సత్యనారాయణ, ఎన్.సతీష్, ప్రిన్సిపాల్ ఏఎస్ఎన్ మూర్తి, అకాడమిక్ కో ఆర్డినేటర్ విమల, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, పీడీ బోళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

హెడ్ నర్స్ లీల సేవలు అభినందనీయం



గోకవరం ప్రభుత్వాస్పత్రి హెడ్‌నర్స్ లీలను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో హెడ్ నర్స్‌గా పని చేస్తున్న లీల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఆమెను గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ వనజాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు తోలేటి రాంప్రసాద్, మందపాటి సతీష్, వైద్యులు ఝాన్సీ, చైతన్య, రామలక్ష్మి, భార్గవి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో జాతీయ సదస్సు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సెప్టెంబర్ 15, 16వ తేదీల్లో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ సవాళ్లు అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను గుర్తించి, భవిష్యత్తులో చేయాల్సిన పరిశోధనలు, పర్యావరణ హితంపై చర్చిస్తామన్నారు. సదస్సు కార్యనిర్వాహణాధికారి డాక్టర్ బి.మల్లికార్జున పాల్గొన్నారు.

వలంటీర్లు.. సేవా వారధులు

- ఇంటి ముంగిటకే పథకాల అందజేత
- లబ్ధిదారుల నుంచి ప్రశంసల జల్లు

బిక్కవోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. పుస్తకాలకే పరిమితమైన గ్రామ స్వరాజ్యాన్ని ప్రత్యక్షంగా చూపించాయి. ప్రధానంగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందజేస్తున్న వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారథులుగా నిలుస్తున్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని కుల, మత, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులకు చేరుస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు.

నాలుగేళ్లు పూర్తి

సరిగ్గా నాలుగేళ్ల క్రితం 2019 ఆగస్టు 15వ తేదీన వలంటీర్లు బాధ్యతలు చేపట్టారు. తమకు అప్పగించిన 50 ఇళ్లల్లో ఎవరికి ఏ కష్టమొచ్చినా సాయమందిస్తూ ఈ నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అయినవాళ్లుగా మారిపోయారు. నెలనెలా ఒకటో తేదీనే పింఛన్ అందజేయడంతో పాటు ప్రభుత్వం నుంచి ఏయే పథకాలున్నాయో లబ్ధిదారులకు వివరించి దరఖాస్తులు పూర్తి చేసి వారికి ఆ పథకాలు అందేలా చూస్తుండడంతో వారి సేవలపై ప్రజల నుంచి ప్రశంసల జల్లు కురుస్తుంది. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలకు ఎంతో కొంత దక్షిణ సమర్పిస్తే తప్ప పనులయ్యేవి కాదు. కాని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎలాంటి అవినీతికి ఆస్కారమివ్వకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయడంలో వలంటీర్ల పాత్ర వెలకట్టలేనిది. కరోనా సమయంలో కోవిడ్ బారినపడిన రోగుల ఇళ్లకు పాలు, నీళ్లు, కూరగాయలు, నిత్యావసరాలు అందజేయడమే కాకుండా ఎవరికైనా అత్యవసరంగా ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా వలంటీర్లు వెనకాడలేదు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, రైతు నేస్తంతో పాటు బియ్యం కార్డు, పింఛన్ తదితర 540 రకాలు సేవలను వలంటీర్లు అందిస్తున్నారు.



పందలపాకలో వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న వలంటీర్లు

అనపర్తి నియోజకవర్గంలో వలంటీర్ల వివరాలు

మండలం	సచివాలయాలు	వలంటీర్లు
అనపర్తి	19	448
బిక్కవోలు	21	423
రంగంపేట	19	373
పెదపూడి	20	354
మొత్తం	79	1598

వలంటీర్ల సేవలు మరువలేనివి



వలంటీర్లు అందిస్తున్న సేవలు అద్భుతం. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఇంటి ముంగిటకే తీసుకొచ్చి అందిస్తున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో పాజిటివ్ వచ్చిన బాధితులను క్వారంటైన్ సెంటర్‌కు పంపించడంతో పాటు స్థానికులకు అందించిన సేవలు మరిచిపోలేనివి.
– జంగా శ్రీనివాస్‌ప్రసాద్, ఉపాధ్యాయుడు, బిక్కవోలు

ఒకటో తేదీనే పింఛన్



వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుతుండగానే పింఛన్ ఇంటికే తీసుకొచ్చి అందిస్తున్నారు. మా వలంటీర్ ప్రభుత్వం ద్వారా ఏయే పథకాలున్నాయో మాకు వివరించి దరఖాస్తు చేయించి మాకు అవి వచ్చేలా చేస్తుంది. ఎప్పటికప్పుడు నా యోగక్షేమాలు తెలుసుకుంటుంది.
– చల్లా రామయ్యమ్మ, వృద్ధురాలు, పందలపాక

వలంటీర్‌గా గర్వపడుతున్నా



నేను ఇంటర్ చదువుకున్నాను. వలంటీర్‌గా చేరడం వల్ల గ్రామంలోనే ఉపాధి లభించడంతో పాటు ప్రజలకు నేరుగా సేవ చేసే భాగ్యం కలిగింది. ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు చేరవేయడంలో నా పాత్ర ఉంటున్నందుకు గర్వంగా అనిపిస్తుంది.
– కొటాని దేవి, వలంటీర్, పందలపాక

మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సూర్యప్రసాద్



సూర్యప్రసాద్‌ను అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

పెదపూడి: మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా దోమాడ గ్రామానికి చెందిన ఒబిలిశెట్టి సూర్యప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి తెలిపారు. దోమాడ గ్రామంలో గురువారం జరిగిన ఆ సంఘం ఆత్మీయ కలయికలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సూర్యప్రసాద్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పెద్ద రత్నాజీ, సంఘం గౌరవ అధ్యక్షుడు ఒబిలిశెట్టి హరిబాబు, ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశరావు, కోశాధికారి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు నాగేంద్ర పాల్గొన్నారు.

ఇద్దరికి రిమాండ్

రంగంపేట: మండలంలోని వెంకటాపురం శివారులో నిర్వహించిన దాడుల్లో అనుచూరి ఏసుబాబు అనే వ్యక్తి నుంచి 10 లీటర్ల సారా, తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ జి.వెంకటలక్ష్మి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేసిన పెద్దాపురం మండలం సిరివాడ గ్రామానికి చెందిన గార్లంకల సత్తిబాబును కూడా అరెస్టు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించామన్నారు.

మదర్ థెరిస్సా విగ్రహావిష్కరణ



తొర్రేడు హైస్కూల్లో మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉప్పులూరి సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మదర్ థెరిస్సా విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని రికార్డు అసిస్టెంట్ పట్నాల వెంకటేశ్వరరావు బహూకరించారు. అలాగే పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి కపిలేశ్వరపురం మండలం మాచరం జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెచ్ఎంగా వెళ్లిన రమాదేవిని, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి రూరల్ ఎంఈవో–2గా వెళ్లిన చందుకుమార్‌ను, ఉపాధ్యాయుడిగా పనిచేసి సీతానగరం మండలం వెదుళ్లపల్లికి బదిలీపై శతపతి శ్రీనివాస్‌ను గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చిట్టూరి వెంకటరావు, దండమూడి అర్జునరావు, మల్లిన సూర్యప్రకాశరావు, మండల విద్యాశాఖాధికారి –1 తులసీదాస్, రాజానగరం ఎంఈవో–2 జ్యోతిప్రసాద్, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు మేకా సాయిబాబు పాల్గొన్నారు.

రైట్ కళాశాల విద్యార్థి ప్రతిభ



మోహన్ కృష్ణను అభినందిస్తున్న దృశ్యం

రాజానగరం: భూపాలపట్నంలోని రైట్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న ఎం.మోహన్ కృష్ణ ఇటీవల విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన డెడ్‌లిఫ్ట్ చాంపియన్ షిప్‌లో బంగారు, బెంచ్‌ప్రెస్ చాంపియన్ షిప్‌లో వెండి పతకాలు సాధించాడు. ఈ విషయాన్ని కళాశాల సెక్రటరీ ఎ. శ్రీహరి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విజేతను అభినందించారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే



సీఎంను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ తేతలి దశరథ రామారెడ్డి

అనపర్తి: ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, హైదరాబాద్ యశోదా ఆసుపత్రికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ తేతలి దశరథ రామారెడ్డిలు గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టర్ దశరథ రామారెడ్డి కుమార్తె డాక్టర్ శ్రావ్య వివాహ వేడుక ఈ నెల 24న రాజమహేంద్రవరంలో జరగనుంది. ఈ సందర్భంగా వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ సీఎం జగన్‌కు డాక్టర్ దశరథరామారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. అదే విధంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రంగంపేట మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, కొప్పవరం మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, రామేశ్వరం సర్పంచ్ కొటికలపూడి చినబాబులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. రామేశ్వరంలోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేయనున్న ఆర్చి డిజైన్‌ను సీఎం జగన్‌కు చూపడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారని ఎమ్మెల్యే తెలిపారు.

సీఎం జగన్‌కు అన్నివర్గాల ఆదరణ



రాపాకలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రాపాకలో గడప గడపకూ..

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు అన్ని వర్గాల ప్రజల మద్దతు లభిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రాపాకలో గురువారం రెండోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. రాజా మాట్లాడుతూ నాలుగేళ్లలో రాపాకలో రూ 2.95 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దానిలో భాగంగా రూ.50 లక్షలతో సొసైటీ శాశ్వత భవన నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. జగన్ పాలనలో రైతులందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో వరికుప్పలు అగ్నిప్రమాదంలో కాలిపోతే, నష్టపోయిన రైతులకు ఆ ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే వరికుప్పలు కాలిపోయిన 33 మంది రైతులకు రూ 10.41 లక్షలు అందించడం జరిగిందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గుర్తు చేశారు.

అర్జీలను పరిష్కరిస్తాం

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలన్నింటినీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాజా అన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాజానగరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండలకన్వీనర్ ఘంటా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ 2 సత్యం మదన్‌బాబు, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, పార్టీ నాయకులు పీఏసీఎస్ చైర్‌పర్సన్ పిచ్చుకల రవికుమార్, పిచ్చుకల విజయ్ కుమార్, రావూరి రామరాజు, ముత్యాల సత్తిబాబు, ముత్యాల బాలకృష్ణ, మాగంటి హరి, గుండుబోయిన వీరబాబు పాల్గొన్నారు. కాగా.. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు శ్రీరామనగరంలోని చిట్టి బాబాజీ సంస్థానానికి చెందిన గజరాజు ఆశీస్సులు అందించింది.

సబ్ రిజిస్ట్రార్‌కు సర్పంచుల వినతి

మధురపూడి: గ్రామాల్లోని భూవిక్రయాల ద్వారా వచ్చే బదలాయింపు సుంకం పంచాయతీలకు మళ్లించాలని కోరుతూ కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ ఐహెచ్ ఆర్‌కే కృష్ణ ప్రసాద్‌కు మండలంలోని సర్పంచులు గురువారం వినతి పత్రం అందజేశారు. 2022 మేలో ఇచ్చిన హామీని అమలు జరపాలన్నారు. రిజిస్ట్రార్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అందిస్తామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడియాల పాపారావు, ఏఎంసీ చైర్మన్, గుమ్ములూరు సర్పంచ్ నక్కా రాంబాబు తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌లకు సదస్సు

మధురపూడి: సారా, లూజు పెట్రోలు విక్రయాలు, పేకాట, కోడిపందేలు, బెల్టుషాపులు లేని విధంగా కోరుకొండ మండలాన్ని తీర్చిదిద్దుదామని ప్రొబిషనరీ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా అన్నారు. ఈ మేరకు గురువారం కోరుకొండ పోలీసుస్టేషన్‌లో లా అండ్ ఆర్డర్‌పై గ్రామ సర్పంచులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘ విద్రోహుల కార్యకలాపాలపై పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై కట్టా శారదా సతీష్, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు పాల్గొన్నారు.

కూనవరంలో చోరీ

సీతానగరం: కూనవరంలోని బరగాటి కన్నమ్మ ఇంటిలో దొంగలు చోరీ చేశారు. ఎస్సై కె.చిరంజీవి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. రెండు పోర్షన్ ఇంటిలోని ఒక పోర్షన్‌లో కన్నమ్మ ఉంటోంది. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి నిద్రించింది. గురువారం ఉదయం లేచి చూడగా బీరువా తెరిచి కనిపించింది. పరిశీలించగా అందులోని రూ.25 వేలు, సెల్‌ఫోన్, 15 తులాల వెండి, 4 గ్రాముల బంగారు సూత్రాలు మాయమయ్యాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శ్రావణం... శుభకరం...



పందలపాక కాలువ రేవులో పూజలు చేస్తున్న మహిళలు

బిక్కవోలు: పండగలు, వ్రతాలకు మారుపేరుగా నిలిచే మాసం శ్రావణం. ఎన్నో శుభకార్యాలను వెంట తెచ్చే శ్రావణమాసం ఆగస్టు 17 నుంచి ప్రారంభమైంది. శ్రావణ మాసంలో 20న నాగచతుర్థి, 21న గరుడ పంచమి, 22న మంగళగౌరి వ్రతం, 25న వరలక్ష్మీ వ్రతం, 31న శ్రావణపౌర్ణమి(రక్షాబంధన్,) సెప్టెంబరు 6న కృష్ణాష్టమి తదితర పండగలు వస్తాయి. శ్రావణ మాసంలో మంగళవారాల్లో శ్రీమంగళ గౌరీ వ్రతం, శుక్రవారాలు లక్ష్మీపూజలు నిర్వహిస్తారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లోని పలు అమ్మవారి ఆలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా సందడి వాతావరణం నెలకొంది.

సమగ్ర ఓటర్ల సర్వే సకాలంలో పూర్తి చేయాలి



ఓటర్ల సర్వేపై సమీక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్

పెదపూడి: ఇంటింటా చేపడుతున్న సమగ్ర ఓటర్ల సర్వేను బీఎల్ఓలు, అధికారులు సకాలంలో పూర్తి చేయాలని అనపర్తి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఇంటింటా నిర్వహిస్తున్న ఓటర్ల సర్వే జాబితాపై అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల ఏఈఆర్‌ఓలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనపర్తి మండలంలో 70 శాతం, బిక్కవోలు మండలంలో 81 శాతం, పెదపూడి మండలంలో 86 శాతం, రంగంపేట మండలంలో 86 శాతం ఇళ్లలో సర్వే పూర్తయిందన్నారు. నియోజకవర్గంలో మొత్తంగా 80 శాతం ఇళ్లలో ఓటర్ల సర్వే పూర్తయిందన్నారు. ఈ నెల 25 నాటికి ఇంటింటా సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, డీటీ రామ్‌కుమార్, ఆర్ఐ.ఎం.త్రివేణి, ఏఈఆర్‌ఓలు వై.సరస్వతి, కె.పోసిబాబు, దొరకయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా జగన్ పాలన

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చీపురపల్లిలో తాగునీటి పథకం ప్రారంభం

సీతానగరం: రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. చీపురపల్లిలో రూ.55 లక్షలతో నిర్మించిన సత్యసాయి రక్షిత తాగునీటి పథకాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలకు గోదావరి నీటిని అందించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో చీపురపల్లి, నాగంపల్లి, అచ్చయ్యపాలెం ఒక పంచాయతీగా ఉండగా, వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చిన తరువాత పరిపాలనా సౌలభ్యం కోసం రెండు పంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. సత్యసాయి తాగునీటి పథకంలో భాగంగా పురుషోత్తపట్నం నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు పైప్‌లైన్ వేసినట్టు తెలిపారు. తద్వారా చీపురపల్లి, అచ్చయ్యపాలెం, పెదకొండేపూడి గ్రామాలకు గోదావరి నీరు అందించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికుమార్, ఏఈ వి.అవినాష్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, సర్పంచ్ గోపిశెట్టి సత్య అనురాధ, ఎంపీటీసీ బేడిసి లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పార్టీ నాయకులు గోపిశెట్టి అచ్చారావు, మన్నెల వెంకట్రావు పాల్గొన్నారు.



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సాయితేజ సూర్యనారాయణరెడ్డి మృతి

- పార్థివ దేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సూర్యనారాయణరెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాయవరంలోని సాయితేజ విద్యానికేతన్ కరస్పాండెంట్ కర్రి సూర్యనారాయణరెడ్డి(67) అనపర్తి మండలం రామవరంలోని ఆయన స్వగృహంలో గురువారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి రామవరం చేరుకుని సూర్యనారాయణరెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్యనారాయణరెడ్డి రామచంద్రపురం డిగ్రీ కళాశాలలో తనకు సీనియర్ అన్నారు. రాయవరంలో సాయితేజ విద్యానికేతన్‌ను ప్రారంభించి రాయవరం, పరిసర గ్రామాల విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. సూర్యనారాయణరెడ్డి పార్థివదేహాన్ని సందర్శించినవారిలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమిలు న్నారు. ఆకస్మికంగా మృతి చెందిన సూర్యనారాయణరెడ్డి నేత్రాలను దానం చేయాలని ఆయన కుటుంబ సభ్యులు నిశ్చయించుకుని అనపర్తి శ్రీరాధాకృష్ణ ఐ–బ్యాంక్‌కు తెలియజేశారు. ఐ–బ్యాంక్ సిబ్బంది కార్నియాలను సేకరించారు.



సాయితేజా సూర్యనారాయణరెడ్డి(ఫైల్)

విజయవంతంగా నృత్యయజ్ఞం

సీటీఆర్ఐ: కూచిపూడి నృత్యానికి పూర్వ వైభవం తీసుకురావడానికి రాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు జీవీ నారాయణ సాగిస్తున్న నృత్యయజ్ఞం ఏడో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా గురువారం అన్నవరంలోని సత్యనారాయణ స్వామి సన్నిధిలో నృత్య ప్రదర్శన జరిగింది. అనంతరం సాయంత్రం సింహాచలంలోని లక్ష్మీ నృసింహ దేవస్థానంలో నృత్య నీరాజనం చేశారు. ఈ సందర్భంగా జీవీ నారాయణ మాట్లాడుతూ 66 రోజుల పాటు నిర్విరామంగా దేశంలోని అన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో నృత్య నీరాజనం నిర్వహిస్తామన్నారు. రాజమహేంద్రవరంలో ఆగస్టు 11వ తేదీన ప్రారంభించిన ఈ యాత్ర గురువారం సింహాచలం చేరుకుందన్నారు. కూచిపూడి నృత్యానికి పూర్వవైభవం తీసుకురావడమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో జి.లక్ష్మీదీపిక, నృత్య బృందం పాల్గొన్నారు.



నృత్యాభినయం చేస్తున్న కళాకారిణులు

21న సర్వసభ్య సమావేశం

రంగంపేట: రంగంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.శ్రీరామరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి వివరాలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.